క్లుప్తంగా

రేపు జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: జాతీయ లోక్ అదాలత్ శనివారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని న్యాయ స్థానాల ప్రాంగణంలో జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్, పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి, గృహ హింస, వాహన ప్రమాద నష్టపరిహార కేసులు తదితర వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ మార్గంలో తమ కేసులను పరిష్కరించుకోవాలని చెప్పారు.

వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. మున్సిపాల్టీలోని 19, 20 వార్డుల్లోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులను గురువారం చేపట్టారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు, అతిసార ప్రబలకుండా రూ.10 లక్షల వ్యయంతో టెండర్ ద్వారా డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తామని చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రజలు నివాసాల సమీపంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలు భుజించాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రెయినేజీల్లో మురుగు తొలగింపు, మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న చెత్త తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



చాట్రాయి: ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఎ. రాము అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్ల తోటల్లో చేసిన పనులకు సంబంధించి పండ్ల మొక్కలను పెంచిన రైతులకు వెంటనే బకాయిలు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీఓ లక్ష్మీని ఆదేశించారు. పంట కాలువల్లో పూడిక, పండ్ల మొక్కలకు చుట్టూ గుంతలు తీసే పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో రైతలను కలిసి పథకంలో ఏఏ పనులు ఉన్నాయో వివరంగా తెలియజేయాలని, వేతనం రూ.300 ఉండగా కనీస వేతనం రూ. 280 వచ్చే విధంగా పనులు చేయించి కూలీలకు చెల్లించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ని వినియోగించుకోవాలి



చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న సోలార్ విద్యుత్‌ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీ నారాయణ అన్నారు. గురువారం మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన ద్రోణంరాజు శ్రీనివాసరావు గృహంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్స్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌరశక్తి ద్వారా వచ్చే విద్యుత్ వలన విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చునని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. సోలార్ ప్లేట్స్ 25 సంవత్సరాలు ప్రామాణిక జీవిత కాలమని, ఐదేళ్ల పాటు వారంటీ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి తిరువూరు దారా టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొంది.

సాగుకు సమాయత్తం

- నారుమడులు పోసే పనిలో రైతులు బిజీ
- మరి కొందరు వెదసాగు వైపు దృష్టి
- మండలంలో 8 వేల ఎకరాల్లో వరి సాగుకు అవకాశం



నారుమడికి భూమిని సిద్ధం చేస్తున్న రైతు

గంపలగూడెం: ఏరువాక పౌర్ణమితో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యారు. మండలంలో ప్రధానంగా ఈ సీజన్‌లో వరి సాగు చేస్తారు. గంపలగూడెం మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారని అధికారులు అంచనా. ఇందుకోసం 350 ఎకరాల విస్తీర్ణంలో వరి నారు పోయాల్సి ఉంది. వరిపైరు సాగు వరినారు పెంచి నాటు వేసే విధానం ఒకటి కాగా, నేరుగా వెదపెట్టే పద్ధతి మరొకటి. గతంలో నారుపోసే విధానాన్ని రైతులు ఎక్కువగా అవలంబించగా.. ప్రస్తుతం వెద పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు. అనుకూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి సాగుకు అవసరమైన నారుమడులు పోసేందుకు రైతులు గడచిన నాలుగైదు రోజులుగా తగిన చర్యలను చేపట్టారు. ఎకరం విస్తీర్ణం వరిసాగుకు ఐదు సెంట్ల భూమిలో 30 కిలలో విత్తనాలను చల్లి నారుమడి పోస్తారు. దీనికై భూమిని తయారు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా బీపీటీ 5204 (సాంబ మసూరి), ఎంటీయూ 1061 రకాలను సాగుచేస్తారు. మార్కెట్ ధర రీత్యా గడచిన ఏడాది సాంబ మసూరి రకం ఎక్కువగా సాగు చేశారు. ఈ ఏడాది కూడా ఇదే రకం సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖాధికారుల అంచనా.

నారుమడుల తయారీలో నిమగ్నం

మండలంలో సాధారణ విస్తీర్ణంలో సాగుకు 350 ఎకరాల విస్తీర్ణంలో వరినారు మడులు పోయాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నీటి వసతి ఉన్న చోట నారుమడులు పోయగా, మిగిలిన గ్రామాల్లో ఇటీవల ఆశాజనకంగా కురిసిన వర్షాలతో రైతులు నారుమడుల తయారీలో నిమగ్నమయ్యారు.

వెద సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

నారు పెంచి నాటు వేసే పద్ధతి కంటే ఈ ఏడాది నేరుగా వెదజల్లే పద్ధతిన వరిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. నారు పెంచి కోసి నాట్లు వేయాలంటే అయ్యే ఖర్చుకంటే వెదజల్లే పద్ధతిన ఖర్చు తక్కువ అవుతుందని రైతులు చెబుతున్నారు. నారు పెంచి నాటు వేసే పద్ధతికి ఎకరానికి 30 కిలోల విత్తనాలు అవసరం ఉండగా వెద పద్ధతికి 15 నుంచి 16 కిలోల విత్తనాలు సరిపోతాయని రైతులు తెలిపారు. దీనికి తోడు వెదజల్లే పద్ధతిన వరి సాగు చేసి తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే దిగుబడి కూడా పెరుగుతుంది. ఈ కారణంతో ఈ ఏడాది ఈ పద్ధతిన సాగు ఎక్కువగా చేపట్టేందుకు రైతులు సిద్ధపడ్డారు.

ఆరోగ్యకర నారు సాగు ఇలా..

ఆరోగ్యకరమైన నారును సాగుచేసేందుకు మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ రైతులకు పలు సూచనలు చేశారు. అవి..

- ప్రతి ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని (విత్తనాలు చల్లే ముందు ఒక కిలో, 12 రోజుల తర్వాత మరో కిలో) వినియోగించాల్సి ఉంది. ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి.
- శిలీంద్రనాశనితో శుద్ధి చేసిన విత్తనాలను మొక్క కట్టి మొలక శాతం పరీక్షించిన తర్వాతే వినియోగించాలి.
- జింక్ లోప నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- విత్తిన పది రోజులకు, 16 రోజులకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్, క్లోరోఫైరిఫాస్ రెండు ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- నారు తయారై నాటు వేసేందుకు వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి మడిలో పలుచగా నీరు ఉంచి వేయాలి.

ఉద్యమకారుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం



నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం రాధికారాణి, ఉపాధ్యాయులు

నూజివీడు: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం గేయం ఆనాటి ప్రజలందరినీ ఏకతాటిపై నిలిపిందని గొల్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. వందేమాతరం గేయ రచయిత బంకిం చంద్ర ఛటర్జీ జయంతి సందర్భంగా బుధవారం గొల్లపల్లి హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ వందేమాతరం గేయం స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమ కారులకు స్ఫూర్తి నింపిందన్నారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకిం చంద్ర ఛటర్జీ అగ్రగణ్యుడని, ఆయన ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాకుండా భారతీయ సాహిత్యాన్ని శతాబ్దం పాటు ప్రభావితం చేశారన్నారు.

ఆయన రచించిన దేశభక్తి గీతం ప్రజలను ఉత్తేజపరిచి స్వాతంత్ర్య పోరాటం వైపు ఉద్యమింప చేసిందని చెప్పారు. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర ఛటర్జీ కొత్త ఒరవడి సృష్టించారని వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు సాయం రూ. 20 వేలు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల డిమాండ్



ఎ.కొండూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20 వేలు మంజూరు చేయాలని, రూ.5 లక్షల రుణాల వరకు పావలా వడ్డీ అమలు చేయాలని, వేరుశనగ, కంది, వరి విత్తనాలపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలని, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, నృసింహాద్రి వనమాలి, నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్, సుబానీ, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలి..

ఎ.కొండూరు: వ్యవసాయ పరికరాలు 50 శాతం రాయితీతో రైతులకు, కౌలు రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రైతులు, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డేవిడ్ మాట్లాడుతూ రైతులకు సాగు సహాయం రూ.20 వేలు వెంటనే అందించాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, రైతులకు కావాల్సిన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేసి వారికి తక్షణమే కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం. వెంకటేశ్వరరావు, మహిళా రైతు బి. బుజ్జి, ఎం. తిరుపతమ్మ, ఎస్. కుమారి, రైతులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్ష కార్యదర్శులుగా కళ్లేపల్లి నారాయణరావు, తమిరి రమేష్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా తుమూలూరి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా పి.పవన్‌కుమార్, రాఘవేంద్రరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 28న జరుగుతుంది.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న వీరాస్వామి

ఎ.కొండూరు: రామచంద్రాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందజేశారు. దివంగత చాట్ల కోటయ్య, జమలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చాట్ల వీరాస్వామి మాజీ సర్పంచ్ చాట్ల రోశయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరాస్వామి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని చెప్పారు. విద్యార్థులకు తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జె. సాయిబాబు, ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాయిని శాంతకుమారి, ఎ. అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ కట్టడాలను కాపాడుకుందాం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వారసత్వ సంపదైన కట్టడాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్‌లో డిస్పాచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బందిని గురువారం చైర్మన్ అభినందించారు. మోటపోతుల ఉదయ్ నాగభూషణం, షేక్ నయీమ్ పాషాలు భారతదేశంలో ఉన్న పురాతన వారసత్వ కట్టడాలను అతి తక్కువ సమయంలో సందర్శించి రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ చలసాని ఆంజనేయులును కలిసి పర్యటన వివరాలను తెలిపారు. పర్యటన నేపథ్యంలో అరుదైన రికార్డు సాధించడంతో ఇద్దరికి వరల్డ్ రికార్డు ఇండియా, ఇండియాస్ వరల్డ్ రికార్డ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించామని పేర్కొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలి



తిరువూరులో డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తిరువూరు: తిరువూరు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని 15వ వార్డులో మురుగు నీటి పారుదల వ్యవస్థను పరిశీలించిన ఆయన కచ్చా డ్రెయిన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ లోవరాజును ఆదేశించారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి మధిర వైపు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

మైలవరం: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం. శివపార్వతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం కోర్టు పరిధిలో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులను రాజీ చేసుకుని కక్షిదారులు సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ముసునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ చాగంటి పద్మావతీదేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ బీబీఎస్ సుబ్బారావు అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులకు గురువారం విద్యా ప్రవేశం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 24 నుంచి జూలై 25వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల ప్రవేశ మాసోత్సవాల సందర్భంగా విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో 63 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు మల్లేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలను భక్తులు వీక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



తిరువూరులో విత్తన దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అధికారులు



కంభంపాడులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

తిరువూరు: మండలంలో విత్తనాలు విక్రయించే దుకాణాల్లో అంతర్గత స్క్వాడ్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, సోర్స్ సర్టిఫికెట్లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. విత్తనాలను గరిష్ట చిల్లర ధర కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజూ స్టాక్ బోర్డులో విత్తన నిల్వలు, ధరల వివరాలను నమోదు చేయాలని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో స్క్వాడ్ అధికారులు ఎం. శ్రీనివాసరావు, పి. పద్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి..

ఎ.కొండూరు: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఏడీఏ ఎం. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, చీమలపాడు, కంభంపాడు గ్రామాల్లో గురువారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకం విత్తనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. స్టాక్ రికార్డులను, ధరల పట్టికను, సేల్స్ రికార్డులను, నిల్వ ఉన్న స్టాకును పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



కొండపల్లి గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు



కొటికలపూడిలో చిన్నారులతో అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యతో పాటు సంపూర్ణ పోషకాహారం అందుతుందని ఈలప్రోలు, కేతనకొండ సెక్టార్ సూపర్‌వైజర్లు రమాదేవి, జాహీదాబేగం అన్నారు. కొండపల్లి రాజీవ్‌నగర్, కొటికలపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను ఎంపీపీ పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందుతున్న సేవలు, సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. ఎంపీయూపీ పాఠశాల ప్రదానోపాధ్యాయిని లీలాకుమారి, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రెడ్డిగూడెం: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ సందేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పరిసర ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి పూట దోమలు కుట్టకుండా దోమ తెరలను ఉపయోగించాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధి, బోదకాలు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కలుషిత ఆహారం వల్ల వాంతులు, విరోచనాలు, అతిసార, కామెర్లు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. జ్వరాలు, వాంతులు, విరోచనాల వల్ల ఇబ్బందులు పడుతుంటే గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను, ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న కృష్ణకాంత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డిజిటల్ మార్కెటింగ్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని రైజన్ సాఫ్ట్ టెక్నాలజీ లిమిటెడ్ ఎండీ విష్ణుభొట్ల కృష్ణకాంత్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజిటల్ మార్కెటింగ్ – అవశ్యకత – అవకాశాలు' అంశంపై సదస్సును కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన విష్ణుభొట్ల కృష్ణకాంత్ మాట్లాడుతూ సాంకేతికతపై పట్టు ఉండి సృజనాత్మకత, విశ్లేషణాత్మక సామర్థ్యాలను కలిగిన వారు అద్భుతమైన అవకాశాలను పొందవచ్చన్నారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. కాలానుగుణంగా పోటీ పడుతూ ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత ప్రపంచం డిజిటల్ మార్కెటింగ్ దిశగా పరుగులు తీస్తోందని వివరించారు. ఆ దిశగా విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలకు పదును పెట్టి అందులోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక విప్లవం అనేక అవకాశాలను అందిస్తోందన్నారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. విభాగాధిపతి పి. రవీంద్ర పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం భక్తులకు అన్న ప్రసాద పంపిణీ జరిగింది. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాన్ని అందజేసినట్లు కమిటీ కార్యవర్గం పేర్కొంది. కార్యక్రమంలో పొట్నూరి రాజా, మజ్జి శ్రీనివాసరావు, పోతిన బేసికంతేశ్వరుడు, తమ్మిన సూర్యకుమారి, పణుకు రమా, ఈది ఎల్లారాజారావు, పోతిన ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం దాత మల్లాది శ్రీనివాసరావు దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. 500 మంది భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి బాబావారి ప్రసాదాన్ని స్వీకరించారు.

- **ఆటోనగర్(విజయవాడతూర్పు):** ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్‌కు రూ.10వేలను క్లబ్ సభ్యుడు బాహుబలేంద్ర కోటేశ్వరావు అందజేశారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. రవీంద్రనాథ్‌కు ఆయన అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కోటేశ్వరరావును శాలువాతో సన్మానించారు. ఐలా మాజీ చైర్మన్, కార్యదర్శి సుంకర దుర్గాప్రసాద్, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.